ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023
5
విజయనగరం



26న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 26న సాయంత్రం 5గంటలకు విజయనగరం డిపో పరిధిలో గల ప్రయాణీకులు సౌకర్యార్థం ప్రయాణ సమస్యలు , అవసరాలు తెలిపేందుకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రయాణికులు 9959225620 నెంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యలు తెలియజేయడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

చలో విజయవాడ వెళ్లకుండా ముందస్తు అరెస్టులు ● పోలీసుస్టేషన్లు, ఇళ్లల్లో నిర్బంధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారు. ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈనేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఈ కార్యక్రమానికి ఎవరూ వెళ్లకుండా ఆదివారం ఉదయం నుంచి యూనియన్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేశారు. మరికొందరిని స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రంలో శ్రామిక మహిళాసంఘం నాయకులు బి.సుధారాణి ఇంటికి వెళ్లి అరెస్టు చేసి ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజును, గంట్యాడలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనసూయను తమ ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్లకు తరలించారు.



అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడిరాజును ఇంటి వద్ద నిర్బంధించిన టూటౌన్ పోలీసులు

బొబ్బిలి : పట్టణ ప్రాజెక్టు నాయకులు జె.కామేశ్వరి, ఎ.రోజాను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరితే సమస్యలు పరిష్కరించకుండా అరెస్టు చేయడం దుర్మార్గమని ఈ సందర్భంగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జామి : మండల నాయకురాలు వెంకటలక్ష్మిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యకర్తలందరినీ చలో విజయవాడకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. వేపాడలో యూనియన్ నాయకులు కె.లక్ష్మిని వల్లంపూడి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వీరి అరెస్టును సిఐటియు నాయకులు మద్దిల రమణ ఖండించారు.

రాజాం : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ఉమాకుమారి, ఎల్.జయలక్ష్మి, నాయకులు లక్ష్మీనారాయణ, రాంబా యి, పార్వతి మంగమ్మ, వరలక్ష్మి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి అరెస్టులను సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి ఖండించారు.

గజపతినగరం : అంగన్వాడీ యూనియన్ గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం సుభాషినిని పోలీసులు అరెస్టు చేశారు. చలో విజయవాడకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తమ ఇంటి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆమెను అరెస్టును సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్ ఖండించారు.

అంగన్వాడీల అరెస్టులు దుర్మార్గం : సిఐటియు

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు అంగన్వాడీ నాయకులను, కార్యకర్తలను ఎక్కడిక్కడ అరెస్టులు చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న విజయవాడ ధర్నాచౌక వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ దరఖాస్తు చేసినా అనుమతి లేదని నాయకుల ఇళ్లకు వెళ్లి భయబ్రాంతులకు గురి చేసి స్టేషన్లకు తరలించడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యని పేర్కొన్నారు. వెంటనే నాయకులను, అంగన్‌వాడీ కార్యకర్తలను విడుదల



శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణిని స్టేషన్‌లో ఉంచిన వన్‌టౌన్ పోలీసులు

చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు చివరి అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా అయినా పరిష్కరించాలని కోరితే నిర్బంధం ప్రయోగించడం సరికాదని తెలిపారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం,పెన్షన్, పిఎఫ్,ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చెయ్యాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎంతటి నిర్బంధాన్ని ప్రయోగించినా ఉధృతపోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.



గంట్యాడ : యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనసూయ తదితరులను స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు



కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు తమ్మినేని, శంకర్రావు

కొరటాల ఆశయ సాధనకు పునరంకితం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల అభ్యున్నతికి, సమాజ మార్పునకు ఎనలేని కృషి చేసిన కమ్యూనిస్టు మేధావి,సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి కామ్రేడ్ కొరటాల సత్యన్నారాయణ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సిపిఎంజిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. కొరటాల సత్యన్నారాయణ శత జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి తమ్మినేని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంపన్న కుటుంబంలో జన్మించిన కొరటాల పేదల కోసం పని చేశారని అన్నారు. సిపిఎం అభ్యున్నతికి ఎనలేని కృషి చేయడంతో పాటు, దోపిడీ దారుల పాలనకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధిలో ఆయన కృషి ఎనలేనిదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. రైతు సంఘం జాతీయ నాయకులుగా రైతులు, కూలీల కోసం పని చేశారని అన్నారు. తన యావదాస్తిని పార్టీకి ఇచ్చేసి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆప్యాయత, అనురాగాలకు కొరటాల ప్రతీక అన్నారు. ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారా అటువంటి స్ఫూర్తి ప్రదాత ఆశయాలను నెరవేర్చాలని పిలుపు నిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.లక్ష్మి పి.రమణమ్మ, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొరటాల ఉద్యమస్ఫూర్తిని యువతకు అందించాలి

విజయనగరం కోట : పేదల అభ్యున్నతికి కృషి చేసిన కమ్యూనిస్టు నాయకులు కొరటాల సత్యనారాయణ ఉద్యమస్ఫూర్తిని యువతకు అందించాలని ప్రజాశక్తి డెస్క్ ఇంఛార్జి పి.అప్పారావు అన్నారు. ప్రజాశక్తి కార్యాలయంలో కొరటాల చిత్రపటానికి సీనియర్ సబ్ ఎడిటర్ కె.కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ ప్రజాశక్తి అభివృద్ధిలో కొరటాల కీలకపాత్ర పోషించారని, ఆయన ఆశయాలను పత్రిక ద్వారా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కె.రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం : మండలంలోని కంచరాం గ్రామంలో కొరటాల జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పేదల కోసం పోరాడిన మహానాయకుడని కొనియాడారు.

కాలానుగుణంగా మార్పు చెందాలి

ప్రజాశక్తి- రాజాం

మారుతున్న కాలానికి పరిస్థితులను అన్వయం చేస్తూ సిద్ధాంతాలను సమీక్షిస్తూ మార్పు చెందాలని ప్రముఖ సాహితీవేత్త అట్టాడ అప్పల నాయుడ అన్నారు. భారత సమాజంలో భూస్వామ్య వ్యవస్థ అంతరించి పోయిందని, రైతు, కూలీల మధ్య భేదం తరిగి పోతోందని, ఇలాంటి మారుతున్న పరిస్థితులను బట్టి సామాజిక ఆర్థిక సూత్రాలను పునస్సమీక్ష చేసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం రాజాం రచయితల వేదిక 104వ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి. రమేష్ పట్నాయక్ రచించిన గతి తార్కిక భౌతిక వాదం పరిచయం, డేవిడ్ హార్వే -పెట్టుబడి, ఏడు ప్రాథమిక వైరుధ్యాలు పరిచయం, ఇతర వ్యాసాలు అనే రెండు గ్రంథాలను అట్టాడ ఆవిష్కరించారు. సమాజం భావవాదాన్ని వదిలి, భౌతిక వాదాన్ని అనుసరించినప్పుడే అభ్యుదయ పథంలో నడుస్తుందని తెలిపారు. శ్రామిక వర్గాలు మార్క్స్ సూత్రాలను అవగాహన చేసుకున్నప్పుడే అభ్యుదయాన్ని సాధిస్తాయని అన్నారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, రమేష్ పట్నాయక్‌తో పాటు రౌతు గణపతి రావు నాయుడు, అంబల్ల రామ్మూర్తి, పిల్లా తిరుపతి రావు, సమతం మహేశ్వరరావు, ఆల్తి మోహన్‌రావు, డి. కిషోర్, వెలుగు రామానాయుడు, పొదిలాపు శ్రీనివాసరావు, పడాల కవీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త అప్పలనాయుడు

రూ.20కోట్ల వ్యాపార క్లబ్‌లో డిసిఎంఎస్

చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 20కోట్ల 68 లక్షల రూపాయల వ్యాపారం నిర్వహించి రూ.26.24లక్షల నికర లాభాన్ని ఆర్జించామని డిసిఎంఎస్ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన తెలిపారు. ఆదివారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బావన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 కోట్ల రూపాయల పైగా వ్యాపారం నిర్వహించే డిసిఎంఎస్‌లు అయిదు ఉండగా, అందులో విజయనగరం కూడా ఉండడం సంతోషకరమని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, డిసిఎంఎస్ డైరెక్టర్లు, పిఎసిఎస్ పాలకవర్గాల సహాయ సహకారాలతో డిసిఎంఎస్‌ను లాభాల బాటలో నడప గలుగుతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు వ్యాపారాన్ని మరింత పెంచేందుకు సభ్యుల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. గతంలో నిలిచిపోయిన విత్తనాలు, ఎరువుల అమ్మకాలను పునరుద్ధరించి రైతులకు సరసమైన ధరకే విక్రయిస్తున్నామని తెలిపారు. మార్కెట్ ధర కంటే తక్కువగా విద్యార్థులకు లేపాక్షి బ్రాండ్ నోటు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. డిసిఎంఎస్ ప్రాంగణంలో జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. మరింత అభివృద్ధి బాటలో డిసిఎంఎస్ ను నడిపేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి టి.రామారావు , సహకార శాఖ అధికారి అప్పలనాయుడు , మార్క్ ఫెడ్ డిఎం విమల, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ బివిఎస్ సాయికుమార్, డైరెక్టర్లు పి.రామకృష్ణ, పి.నారాయణమూర్తి , వి.శ్రీరాములునాయుడు, ఎస్. సన్యాసినాయుడు, బి.బంగారు నాయుడు, ఎం.శ్రీకాంత్ , సహకార సంఘాల ప్రతినిధులు, డిసిఎంఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన

పక్కాగా ఎపిపిఎస్‌సి పరీక్షలు : డిఆర్‌ఓ

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిపిఎస్‌సి ద్వారా పలు పోస్టులకు నిర్వహిస్తున్న పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డిఆర్‌ఓ అనిత ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈనెల 25 నుంచి అక్టోబర్ 6 వరకు ఈ పరీక్షలు గాజులరేగలోని సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉదయం 9.30 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైతే 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. అభ్యర్థులకు తాగు నీటి సదుపాయాన్ని కలిగించాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, తగు బందోబస్తును ఏర్పాటు చేయాలని, అత్యవసర మందులతో మెడికల్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో పోలీస్, వైద్య సరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు, ఎపిపిఎస్‌సి ప్రతినిధులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌దేవ్ ప్రసాద్, సత్యకాలేజీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఓ అనిత



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

విశాఖ ఉక్కును అమ్మితే అంతు తేలుస్తాం

ఉక్కు పరిరక్షణ యాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మితే బిజెపి అంతు తేలుస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన బైక్‌యాత్ర ఆదివారం కురుపాం, పార్వతీపురం, సాలూరు మీదుగా బొబ్బిలి చేరుకుంది. ఈ సందర్భంగా యాత్ర చేపట్టిన నాయకులకు, కార్యకర్తలకు పలుసంఘాల ఆధ్వర్యాన ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహంజంక్షన్‌లో లోకనాధవ మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మితే నిరుద్యోగ యువతకు ఎలా ఉపాధి కల్పిస్తారని ప్రశ్నించారు. 32మంది ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కును ఏర్పాటు చేయించుకున్నా మన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణతో లక్షమంది ఉద్యోగులు రోడ్డున పడతారన్నారు. ఎల్.ఐ.సి, బ్యాంకులు, రైల్వేను బిజెపి ప్రభుత్వం ఇప్పటికే అమ్మేసిందన్నారు. దేశభక్తి పేరుతో దేశానికి నష్టం చేస్తున్నారని విమర్శించారు. బిజెపి విధానాలను టిడిపి, వైసిపి, జనసేన ప్రశ్నించకుండా సమర్థించడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించకుండా మద్దతు ఇస్తున్నారని అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు నష్టం జరిగితే ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఎరువులు ధరలు పెరుగుతున్నా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు పెంచడం లేదన్నారు. కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటా మన్నారు. సిపిఎం నాయకులు జగన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి చేసి ఉపాధి లేక నిరుద్యోగులుగా మారుతున్నారని అన్నారు. లక్షా30వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను అమ్మివేయడం దుర్మార్గమన్నారు. తమ్మినేని సూర్య నారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు మూడేళ్ల నుంచి పరిశ్రమ వద్ద నిరసనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఐక్యంగా పోరాడి విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శులు జగ్గునాయుడు, రెడ్డి వేణు,ల్, జిల్లా నాయకులు పి.శంకరరావు, వి.ఇందిర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1.56లక్షల పనిదినాలకు రూ.377.29కోట్లు చెల్లింపు

- వ్యవసాయ పనుల వల్ల ఉపాధి పనులు తగ్గుముఖం
- ప్రత్యామ్నాయంగా ఇంకుడు గుంతలు
- జలకళ ద్వారా 370 బోర్లు
- 'ప్రజాశక్తి'తో డ్వామా పీడీ ఉమామహేశ్వరి ముఖాముఖి

ఉపాధి హామీ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 1.56లక్షల పనిదినాలు కల్పించామని డ్వామా పీడీ ఉమామహేశ్వరి తెలిపారు. వీరికి రూ.377.29కోట్ల మేర వేతనాలు చెల్లించామని స్పష్టం చేశారు. వ్యవసాయ పనులవల్ల ప్రస్తుతం ఉపాధి పనులు తగ్గాయని, సంక్రాంతి వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అన్నారు. ఉపాధి పనులు చేయాలనుకునే వారికి ప్రత్యామ్నాయంగా ఇంకుడుగుంతలు తవ్వడం, మొక్కలు నాటడం వంటి పనుల్లో కూలీలను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. జలకళ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 370 బోర్లు వేశామని, వాటికి చెల్లింపులు కూడా జరిగాయని అన్నారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే....

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి



జిల్లాలో జాబ్‌కార్డులు ఎన్ని? ఇప్పటి వరకు ఎన్ని పనిదినాలు ఉపయోగించుకున్నారు.


జిల్లా వ్యాప్తంగా సుమారు 3.51 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుపై ఆ కుటుంబంలోని ఇద్దరు లేదా ముగ్గురు వరకు పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వారు పని కోరిన వెంటనే కల్పిస్తున్నాం. ఇంకా చెప్పాలంటే, పని కల్పించడంలో మన జిల్లా దేశానికే ఆదర్శం. ఈ ఏడాది ఇప్పటి వరకు 1.50లక్షల పనిదినాలు కల్పించాల్సివుండగా 1.56లక్షల పనిదినాలను కూలీలు ఉపయోగించుకున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు చెల్లించిన మొత్తం ఎంత? బకాయి ఏమైనా ఉంది.

ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి రూ.377.29కోట్ల మేర కూలి డబ్బులు చెల్లించాం. ఇంకా రూ.23.40 కోట్ల మేర చెల్లించాల్సివుంది. నిబంధనల ప్రకారం ప్రతి వారం చెల్లింపులు జరుగుతున్నాయి.

ప్రస్తుతం పనులు ఎలా జరుగుతున్నాయి?.

వర్షాలు, వ్యవసాయ పనుల నేపథ్యంలో గత రెండు నెలలుగా పనిదినాల సంఖ్య తగ్గింది. సంక్రాంతి వరకు ఇదే పరిస్థితి ఉంటుంది. ఎందుకంటే మన జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులు, చిన్నరైతులే ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. ఖరీఫ్‌లో ఉబాలు ప్రారంభం మొదలు నాట్లు, కలుపు తీయడం, కోతలు, వరిచేను నూర్పులు వంటి పనుల్లో ఎక్కువ మంది ఉంటారు. కాబట్టి సంక్రాంతి తరువాత మళ్లీ ఉపాధి పనులు ఊపందుకుంటాయి. ఈలోపు పని కావాలనుకున్న వారందరికీ కల్పిస్తున్నాం.



ప్రత్యామ్నాయ పనులు ఏమీ లేవా?

ప్రస్తుతం ఇంకుడు గుంతల తవ్వకాలు మొదలుపెట్టాం. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెల్లో తవ్వకాల కోసం ప్రణాళిక సిద్ధమైంది. కొన్ని చోట్ల తవ్వకాలు మొదలవుతున్నాయి. మొక్కలు నాటే కార్యక్రమం కూడా సాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగనన్న భూ సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్‌కు కూడా అవసరమైన మేరకు కూలీలను పంపుతున్నాం.

ఈ ఏడాది ఎన్ని మొక్కలు నాటేందుకు నిర్థేశించుకున్నారు? అమలు ఎంత వరకు వచ్చింది?

రోడ్ల, కాలువలకు ఇరువైపులా 100కిలో మీటర్ల మేర మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నాం. ఇప్పటి వరకు 65కిలో మీటర్ల పరిధిలో 26వేల మొక్కలు నాటేందుకు అనుమతి కూడా లభించింది. ఇందులో సుమారు 52 కిలోమీటర్ల వరకు మొక్కలు నాటడం జరిగింది. ఇవి కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు అవకాశాన్ని బట్టి మొక్కలు నాటుతున్నాం. మెట్ట ప్రాంతాల్లో రైతులు వ్యక్తిగతంగానూ మొక్కలు నాటుతున్నారు. వారికి మొక్క ఖరీదుతోపాటు సంరక్షణకు కూడా నీటి యాజమాన్య సంస్థ తరపున ప్రభుత్వం కొంత సొమ్ము చెల్లిస్తుంది.

జలకళ పథకం కింద జిల్లాలో ఎన్ని భోర్లు మంజూరయ్యాయి? ఎన్ని ఏర్పాటు చేశారు?

జలకళ పథకం ఏర్పాటు సమయంలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ 500 వ్యవసాయ బోర్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈలెక్కన మొత్తంగా 3,500 బోర్లు ఏర్పాటు చేయాల్సివుండగా 7,149 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జియాలజిస్ట్ సర్వే అనంతరం 705బోర్లు మంజూరు చేశాము. వీటిలో ఇప్పటి వరకు 370 వరకు బోర్ల తవ్వకాలు జరిగాయి. వాటికి సంబంధించి రూ.5కోట్ల 50లక్షల 91వేలు సంబంధిత రిగ్గింక్ కాంట్రాక్టర్‌కు చెల్లించాం.


పుస్తకాలను అందిస్తున్న రెడ్డి రమణ

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. ఆశయ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కాలేజ్ బాలికల వసతి గృహం ఆవరణలో ఆదివారం జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన, నైతిక విలువలు పుస్తకాలు పంపిణీ చేశారు. సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు డోల నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాలు వైపు నడవాలని వాటి ద్వారా గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, చెడు మార్గాల వైపు వెళ్ళకుండా మంచి మార్గం ఎంచుకుని మీ లక్ష్యం వైపు ప్రయాణించాలని అన్నారు. తల్లిదండ్రులు, గురువులు భాధ్యతతో సామాజాన్ని మంచి మార్గం వైపు నడిపించాలని మంచి జీవితాన్ని గడపాలని దానికి అనుగుణంగా మంచి పుస్తకాలు చదవడం ఉన్నత వ్యక్తులు జీవిత చరిత్రలు చదవడం వారిని ఆదర్శంగా తీసుకోవడం పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి దోహదపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ యశోద, విద్యార్థులు పాల్గొన్నారు.


నాయకుల మధ్య కేక్ కట్ చేస్తున్న రమణరాజు

ఘనంగా రమణరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మాజీ డిసిఎంఎస్ చైర్మన్, వైసిపి జిల్లా కోశాధికారి సిరివురూ వెంకట రమణ రాజు 59వ జన్మదిన వేడుకలు మండలంలోని సోమలింగాపురం గ్రామంలో ఆయన స్వగృహంలో ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

హెల్మెట్ వినియోగంపై కళా ప్రదర్శన

ప్రజాశక్తి- బొబ్బిలి

హెల్మెట్ వినియోగంపై చిన్నారులు కళా ప్రదర్శన నిర్వహించారు. హెల్మెట్ వినియోగంపై ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించేందుకు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఎన్టీఆర్ బొమ్మ, శ్రీకళా భారతి, కోర్టు జంక్షన్, గాంధీ బొమ్మ, ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలలో కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడిపితే రక్షణగా పని చేస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేనివారు మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహన్ కోరారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. ఆదివారం హుకుంపేటలో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. వినాయక ఉత్సవాల ద్వారా వీధుల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు.

వికలాంగునికి చేయూత

ప్రజాశక్తి- విజయనగరం

నగరంలోని బిసి కాలనీలో బాబురావు అనే వికలాంగునికి 'మేమున్నాం' సంస్థ రూ. 9వేలు విలువ చేసే వీల్ చైర్ అందించింది. వీల్‌చైర్‌ను అందించిన దాత ఎంవివిఎన్‌కె ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంతలో లేనివారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంది మూర్తి, ఆల్తి సూరిబాబు, డోకి చంద్ర శేఖర్, జయ, భవాని, లత పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు సిహెచ్ పైడితల్లి కోరారు. అధికారంలోకి వచ్చిన వారంలో సి.పి.యస్ రద్దు చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చిన జగన్ ఆ హామీని మరచి ఇప్పుడు జిపియస్ అనే కొత్త విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఒపిఎస్‌ను మాత్రమే అమలు చేయాలని కోరుతూ తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

రజకులను ఎస్‌సిలో చేర్చాలి

ప్రజాశక్తి- విజయనగరం కోట

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని జాతీయ ధోబి మహాసంఘ్ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్‌వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని చాలా రాష్ట్రాల్లో రజకులు ఎస్‌సి జాబితాలో ఉన్నారని, మన రాష్ట్రంలోమాత్రం బిసి జాబితాలో ఉన్నారని తెలిపారు. రాజకీయ సామాజిక విద్యా ఉద్యోగ రంగాల్లో అత్యంత వెనుకబడి దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారన్నారు. విపి సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ జాబితాలో చేర్చాలని పార్లమెంట్‌లో పెట్టడానికి బిల్లును కూడా తయారు చేశారని తెలిపారు. ఈనేపథ్యంలో ఎస్‌సిలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ధోబీ సంఘ అధ్యక్షులు ఎలిగాపు విజయలక్ష్మి, జిల్లా ప్రతినిధులు గుగ్గులాపు రమణ, కెల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 14,17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలకు సోమవారం ఎంపిక జరుగుతుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు వారి స్టడీ, ఆధార్‌కార్డు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో నమోదు చేసి ఉండాలని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు జరిగే విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణానికి విద్యార్థులు చేరుకోవాలని తెలిపారు.

కరెంటు బిల్లుల 'షాక్'

- ఒక్కసారిగా పెరిగిన విద్యుత్తు బిల్లులు
- చెల్లించేందుకు నిరాకరించిన గ్రామస్తులు
- నోటీసులు జారీ చేసిన విద్యుత్ శాఖ
- ఆందోళనకు దిగిన మహిళలు


కరెంటు బిల్లులు సాధారణ ప్రజలకు షాక్ ఇస్తున్నాయి. ఒక్కసారిగా బిల్లు పెరిగిపోవడంతో పేద ప్రజలు బిల్లులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సాధారణ పేద ఇంటికి రూ. 100 నుంచి రూ. 150 వరకూ వచ్చే కరెంటు బిల్లు ఒక్కసారిగా రూ. 1000 నుంచి రూ. 4వేల వరకూ రావడంతో ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి బిల్లులో ఇంత తేడా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు అధికంగా రావడంతో కొంత మంది చెల్లించేందుకు నిరాకరించారు. దీనికి విద్యుత్తు శాఖ అధికారులు బిల్లులు చెల్లించని వారి ఇంటికి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆగ్రహించిన మహిళలు ఆదివారం ఆందోళనకు దిగారు.

ప్రజాశక్తి- వేపాడ

మండల కేంద్రంలో నివాసముంటున్న ప్రజలకు విదుత్తు బిల్లులు షాక్ ఇచ్చాయి. ఒక్కసారిగా బిల్లులు పెరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అదనంగా వచ్చిన బిల్లులు కట్టాలని విద్యుత్తు శాఖ అధికారులు ఒత్తిడి చేయడంతో పాటు ఇంటి యజమాలు లేని సమయం చూసి ఇంటికి వచ్చి అదనంగా వచ్చిన విద్యుత్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. బలవంతంగా పిల్లలు, వృద్దులు చేతిల్లో నోటీసులు పెట్టి వెళ్లిపోతున్నారు. ఇంటి పెద్ద లేకపోయినా పిల్లలు చేత బలవంతంగా సంతకాలు పెట్టించుకుని వెళ్లిపోతున్నారని వాపోతున్నారు. కాగా కొంత మంది నోటీసులు తీసుకోవడానికి నిరాకరించడంతో ఇంటి బయట గోడలకు నోటీసులు అతికించి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేపాడలో ఆదివారం కరెంటు బిల్లులు అధికంగా రావడాన్ని నిరసిస్తూ మహిళలు ఆందోళన చేపట్టారు. ఉన్నటుండి కరెంటు బిల్లులు ఎంతుకు ఇంత ఎక్కువగా వస్తున్నాయని జొన్నాడ కృష్ణమ్మ, జొన్నాడ లక్ష్మి, భోజనంకి మాధవి, నాగలక్ష్మి, సుర్ల ఈశ్వరమ్మ, ఆదపురెడ్డి పార్వతి, చీపురుపల్లి రాములు ప్రశ్నించారు.



నోటీసులు చూపిస్తూ నిరసన తెలుపుతున్న వేపాడ గ్రామస్తులు

విద్యుత్‌శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అదనంగా వచ్చిన బిల్లులను రద్దు చేసి తిరిగి పాత పద్ధతిలో వారికి వచ్చే బిల్లులు మాదిరిగానే తక్కువ మొత్తంలో బిల్లులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



ఒక నెల కరెంటు బిల్లు రూ. 4వేలు

విద్యుత్ మీటర్ వేసినప్పటి నుంచి ఇంత వరకూ రూ. 150 నుంచి రూ. 250 వరకే కరెంటు బిల్లు వచ్చేది. చాలా కాలంగా మా ఇంట్లో ఫ్రిడ్జ్, ఫ్యాను మిక్సీ ఉంది. ఈ నెల మాత్రం రూ. 4వేలు కరెంటు బిల్లు రావడం దారుణం. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యుత్ ఛార్జీలు పెంచనని హామీ ఇచ్చి ఇప్పుడు ఇష్టానుసారం ప్రజలపై భారం మోపడం, విద్యుత్ చార్జీలు పెంచడం రాక్షస పాలనకు నిదర్శనం.



భోజనంకి మాధవి, వేపాడ

నోటీసులు ఇచ్చారు

విద్యుత్తు శాఖ అధికారులు దొంగల్లా ఎవరూ లేని సమయంలో ఇంటికి వచ్చి అదనంగా వచ్చిన కరెంటు బిల్లులు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. తీసుకోవడానికి నిరాకరిస్తే ఇంటి గోడకు అతికించి వెళ్తామని హెచ్చరించారు. దీంతో ఏం చేయాలో తెలియక సంతకం పెట్టాను. ఇంట్లో ఏఏ సామాన్లు వాడుతున్నామో రాసుకుని వెళ్లారు. అదనంగా వచ్చిన కరెంటు బిల్లులు కట్టాలని బెదిరిస్తున్నారు.

నాగలక్ష్మి, గృహిణి, వేపాడ

ప్రభుత్వ ఆదేశాలు మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారులకు అదనపు చార్జీలు చెల్లించాలని నోటీసులు ఇచ్చాం. అంతే తప్ప నా సొంత నిర్ణయం కాదు. పెరిగిన అదనపు విద్యుత్ చార్జీలపై కొంతమంది వినియోగదారులు కోర్టుకు కూడా వెళ్లారు.

సూర్యనారాయణ, ఎలక్ట్రికల్ ఎఇ, వేపాడ

పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి

మండలంలోని పలు గ్రామాల్లో గతం కంటే అదనంగా కరెంటు బిల్లులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.200 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు కనీసం రూ. 500కు పైగా వస్తుందని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా కరెంటు బిల్లులు పెంచితే సాధారణ ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్తు బిల్లులు తగ్గించేస్తామన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి మాటలు నీటిమూటలయ్యాయని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్తు భారాలను తగ్గించాలని కోరుతున్నారు.

సమస్యలపై అధికార పార్టీ సభ్యుల నిలదీత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల సర్వ సభ్య సమావేశంలో అధికార పార్టీ సభ్యులే అధికారులను నిలదీశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు పలు సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. ముఖ్యంగా సతివాడ సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ గత కొన్నేళ్ళుగా తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగు నీరు పొలాలకు అందడం లేదని, ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీరు గుర్ల మండలం రాగోలు వరకు వచ్చి ఆగిపోయిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. పశు సంవర్థక శాఖకు చెందిన మొబైల్ వాహనంలో పశువైద్యులు ఉండడం లేదని ఆ శాఖ సిబ్బందిని నిలదీశారు. వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, బొప్పడాం సర్పంచ్ బొంతు కిరణ్ జల జీవన్ మిషన కింద ఇంటిటికి తాగు నీరు అందించడానికి ప్రాజెక్టు మొదలైందని ఇంతవరకు పనులు పూర్తి కాలేదు సరికదా అసలు అలుగోలు గ్రామంలో ఇంతవరకు జెజెఎల్ మిషన్ పనులు ప్రారంభించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో పనులు జరిగినా వాటికి బిల్లులు చెల్లించక పోవడం ఏమిటని గ్రామీణ నీటి సరఫరా పథకం జెఇని నిలదీశారు. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా గ్రామాల్లో లో ఓల్టేజ్, తీగలు వదులుగా ఉండడం, ట్రాన్స్ ఫార్మర్ మార్చడం, శిధిల స్తంభాలు తీసి కొత్త స్థంబాలు వేయడం వంటి సమస్యలు పరిష్కరించలేని విద్యుత్ శాఖ పని తీరుపై అన్ని గ్రామాల నుంచి సభ్యులు ఎఇని


అధికారులను నిలదీస్తున్న సభ్యులు

నిలదీశారు. ప్రతీసారీ గ్రామాల్లో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు మొరపెట్టుకున్నా సరామామూలే అన్న చందంగా అధికార్లు, నాయకుల తీరు ఉందని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించనపుడు సమావేశాలు ఎందుకు పెడుతున్నారని మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన సభ్యులే అధికారులను నిలదీయడంతో స్పందించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సంబంధిత అధికార్లతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, ఎంపిడిఒ జి.రామారావు, తహశీల్దార్ డి. ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సాధన యువజన సంఘం సభ్యులు

సాధన యువజన సంఘం రక్త దానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సాధన యువజన సంఘం సభ్యులు స్వచ్ఛంద రక్త దానం చేశారు. ఆదివారం సాధన యువజన సంఘం అధ్వర్యంలో విజయనగరం సర్వజన ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మేము సైతం అంటూ జరజాపు పేటకు చెందిన సాధన యువ జన సంఘం సభ్యులు రక్తదానం చేశారు. దేశ ప్రధాని పుట్టినరోజు సందర్భంగా సామాజిక చైతన్యంతో సాధన యువజన సంఘం సభ్యులు తమ వంతు బాధ్యతగా పాల్గొని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. సాధన అధ్యక్షులు పోలుభోతు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత రక్తదానం వైపు మొగ్గుచూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, బి అప్పలనాయిడు, కౌన్సిలర్, మాతృ భూమి సేవా సంఘం అధ్యక్షుడు ఇప్పలవలస గోపి, లాబ్ టెక్నీషియన్స్ మురళి, రమణ, సాధన సభ్యులు పూర్ణా, రామకృష్ణ, కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారిణికి అభినందనలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ ఏడాది ఆగస్టు 19, 20 తేదీల్లో శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 400 మీటర్ల పరుగు పందెంలో ఇండియా తరుపున సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు పాల్గొని సిల్వర్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఆదివారం ఆమె హై స్కూల్ స్థాయి నుంచి ఈ స్థితికి చేరుకోవడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన తన గురువు డాక్టర్ పొట్నూరు శ్రీరాములును ఎస్‌కోటలో కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములు పైడిరాజును అభినందిస్తూ, ఆమెకు పెళ్లి అయిన తర్వాత కూడా క్రీడలు సాధనకు పూర్తిగా సహాయ సహకారాలు ఇస్తున్న భర్త గణపతిని అభినందించారు. క్రీడాకారిని పైడిరాజు మాట్లాడుతూ శ్రీరాములు తన చిన్నతనం నుండి క్రీడలపై వేసిన పునాది నేటికీ చెక్కుచెదరలేదని, ఆయన తమ పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయులుగా రాకుండా ఉండుంటే తమ జీవితాలు వేరే విధంగా ఉండేవని అన్నారు. మామిడిపల్లి గ్రామం క్రీడా గ్రామంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనే మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుందంటే అది


పైడిరాజును అభినందిస్తున్న శ్రీరాములు

కేవలం శ్రీరాములు ప్రోత్సహామేనన్నారు. అనేక మంది క్రీడా కోటాలో ఉద్యోగస్తులుగా స్థిరపడ్డామని, తామంతా ఆయనకు రుణపడి ఉంటామని ఆమె చెప్పారు. శ్రీరాములు మాట్లాడుతూ పైడిరాజు ప్రస్తుతం విశాఖపట్నం గీతం డెంటల్ కాలేజీలో ఏఎన్ఎంగా ఉద్యోగం చేస్తున్నారని, గీతం కాలేజీ యాజమాన్యం కూడా ఆమె క్రీడల్లో రాణించడానికి ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తున్నారని గీతం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



న్యాయ నిర్ణేతగా ఎల్‌జిఎన్ కుమార్ ఎంపిక

కొత్తవలస: ఈనెల 26 నుండి 29వ వరకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న ఆలిండియా స్టీల్ ఎస్‌పిఎస్‌బి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, కొత్తవలస గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యుడు, జాతీయ వాలీబాల్ రిఫరీ ఎల్‌జిఎన్ కుమార్ ఎంపికయ్యారు. ఇప్పటికే కుమార్ పలు జాతీయ, అంతర్జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలు, పలు జాతీయ వాలీబాల్ పోటీలకు న్యాయ నిర్ణతేగా వ్యవహరించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్ దాస్, విశాఖ స్టీల్ ప్లాంట్ స్పోర్ట్స్ మేనేజర్ ఎస్‌జె జార్జ్ ఉత్తర్వులు జారీ చేశారు. కుమార్ ఎంపిక పట్ల విజయనగరం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, విశాఖ పోర్ట్ ట్రస్ట్ వాలీబాల్ చీఫ్ కోచ్ గవర సూరిబాబు, కార్యదర్శి కెవిఎఎన్ రాజు, సహాయ కార్యదర్శి కె. కృష్ణంరాజు, మండల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి మహేంద్ర తదితరులు అభినందనలు తెలిపారు.

పశువులమ్మ పండగ

వేపాడ: మండలంలోని ఆతవ, వల్లంపూడి, బక్కునాయుడుపేట గ్రామాలలో ఆదివారం పశువులమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న పశువులన్నింటినీ ముస్తాబు చేసి పశువులమ్మ ఆలయ వద్దకు చేర్చి అమ్మవారిని పశువులు చుట్టూ సాంప్రదాయబద్ధంగా డప్పు వాయిద్యాలతో ప్రదర్శన చేయించారు. అనంతరం పశువులపై ముగ్రాట జల్లారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పులి సంచారంపై పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొండగట్టు రెవెన్యూ పరిధిలో ఎస్‌కోట సీతారాంపురం గ్రామం పరిసర ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు పులి సంచారంపై ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను అప్రమత్తం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని చెప్పారు. చీకటి పడే వరకూ పొలాల వెంబడి తోటల్లో తిరగకుండా వెలుతురు ఉండగానే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

13వ రోజు కొనసాగిన టిడిపి దీక్షలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఆకులు డిపో వద్ద 13వ రోజు వర్షంలో కూడా టిడిపి నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షలో నియోజకవర్గం టిడిపి యువ నాయకుడు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గొంప కృష్ణ, వేపాడ మండలం టిడిపి అధ్యక్షుడు గొంప వెంకటరావు, ఎస్ కోట నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, కొత్తవలస, వేపాడ, ఎస్‌కోట, ఎల్ కోట, జామి మండలాలకు సంబంధించిన పార్టీ అధ్యక్షులు, సీనియర్ టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


విజయనగరం: నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యేలు

భువనేశ్వరికి టిడిపి నాయకుల పరామర్శ

విజయనగరం కోట: చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆయన సతీమణి భువనేశ్వరిని ఆదివారం రాజమండ్రిలో విజయనగరం, గజపతినగరం మాజీ ఎమ్మెల్యేలు మీసాల గీత, కెఎ నాయుడు పరామర్శించారు. అనంతరం బాబుతో నేను ఫెక్సీలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుకు తాము అండగా ఉంటామని అన్నారు. చంద్రబాబు గొప్ప పరిపాలన దక్షుడు చంద్రబాబు నాయుడు గొప్ప పరిపాలన దక్షుడని విజయనగరం పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆదివారం అశోక్ బంగ్లా వద్ద దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మచ్చలేని మనిషి అని, ఆయనను ఏదోఒక విధంగా ఇరికించేందుకు ఈ సైకో ప్రభుత్వం చూస్తుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంగారు బాబు, 35వ డివిజన్ మాజీ కౌన్సిలర్ రొంగలి రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: అక్రమ అరెస్టులతో భయపడేది లేదని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి చేపట్టిన సామూహిక రిలే నిరాహారదీక్షలు 12వ రోజు ఆదివారం బొబ్బిలిలో కొనసాగాయి. దీక్షలను బేబినాయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ,


బొబ్బిలి: మాట్లాడుతున్న బేబినాయన

మండల అధ్యక్షులు రాంబర్కి శరత్, వి.సత్యనారాయణ, పారాది గ్రామానికి చెందిన తెలుగు మహిళలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండల కేంద్రంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో టిడిపి దీక్షలు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, గేదెల రాజారావు, కడగల ఆనంద్, చింతపల్లి సత్యనారాయణ, లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

పిడుగుపడి మహిళకు అస్వస్థత

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని చిన నందబలగ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పిడుగు పడటం వల్ల పొలంలో పని చేస్తున్న గులిపల్లి సావిత్రి అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బోను వెంకటరమణ, పైలట్ (డ్రైవర్) అమర రాజేష్ చిన నందబలగ చేరుకొని అత్యవసర వైద్యాన్ని అందించారు. మెరుగైన వైద్యం కోసం బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


108లో చికిత్స అందిస్తున్న సిబ్బంది

26న తైక్వాండో జిల్లా ఎంపికలు

విజయనగరం టౌన్ : ఈనెల 26న అండర్ 19 జూనియర్ కాలేజి విభాగంలో జిల్లా తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా ప్రాంగణంలో ఎంపిక పోటీలు ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని తెలిపారు. పోటీలకు 8,9,10 తరగతి విద్యార్థులు కూడా అర్హులేనని తెలిపారు. ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్, ఇంటర్ విద్యార్థులు వారి 10వ తరగతి సర్టిఫికేట్‌తో హాజరు కావాలని తెలిపారు. జిల్లాకు ఎంపికైన క్రీడాకారులను కడప జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపుతామన్నారు. వివరాలకు 9885111375 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు

ప్రమాదకరంగా గొయ్యి..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస గ్రామ పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదకరమైన గొయ్యి ఏర్పడింది. చీకటి పడితే ఈ మలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డును ఆనకుని తుప్పల్లో ఉన్న ఈ గొయ్యిని గుర్తించకపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో స్థానికులు గొయ్యిని గుర్తించే విధంగా అక్కడ రెండు స్తంభాలను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.


రోడ్డును ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న గొయ్యి